తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత

- యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా
- చెరువుల నుంచి రాత్రి వేళల్లో ప్రైవేట్ లేఅవుట్లకు ఎగుమతి



మట్టి తవ్వేసిన శ్రీరామగట్టు సాగు నీటి చెరువు



సబ్ డివిజన్ కార్యాలయ పరిధిలోని నందనాల చెరువులో తవ్వేసిన మట్టి

కొయ్యలగూడెం: తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత, దోచుకున్నోడికి దోచుకున్నంత అన్న రీతిలో ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. శ్రీరామ గట్టు చెరువు, నందనాల చెరువు, అక్రమార్కులకు అడ్డాగా మారింది. ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా చెరువుల్లో మట్టి రవాణాకు ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదు. కూటమి నేతల ప్రలోభాలకు ఆశపడి ప్రభుత్వ శాఖల అధికారులే మట్టి రవాణాకు అనధికారికంగా అనుమతులు మంజూరు చేశారని ప్రచారం ఏజెన్సీ మెట్టలో విస్తృతంగా సాగుతోంది. రాత్రి పది గంటల వేళలో లారీ టిప్పర్ల ద్వారా జేసీబీలను ఏర్పాటు చేసి తెల్లవారే వరకు గత వారం రోజుల నుండి సాగునీటి చెరువులలో మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. మట్టి అక్రమ రవాణా చేస్తుండటం వలన సమీపంలోని పంట పొలాలు దుమ్ము, ధూళి పడి నాశనం అవుతున్నాయని రైతులు, రహదారులు అధ్వానంగా మారుతున్నాయని ప్రజలు చేస్తున్న ఆరోపణలకు అధికారుల నుంచి స్పందన లేకుండా పోతుంది. తరలిస్తున్న మట్టిని కమర్షియల్ అవసరాల నిమిత్తం లే అవుట్ల నిర్మాణానికి, ఇటుక బట్టీలకు అక్రమార్కులు విక్రయిస్తూ పోతున్నారు.

టిప్పర్ మట్టి రూ.3 నుంచి రూ.6 వేలు

టిప్పర్ లారీ మట్టిని మూడు వేల నుంచి ఆరు వేల రూపాయల వరకు విక్రయిస్తున్నారు. అక్రమార్కులు అడ్డు తగిలిన ప్రభుత్వ శాఖల అధికారులకు భారీగా సొమ్ములు ముట్ట చెబుతున్నారని ప్రచారం సాగుతోంది. కూటమిలోని ఒక పార్టీకి చెందిన వారు ఒక రోజు, మరో పార్టీకి చెందిన వారు మరుసటి రోజు విడతల వారీగా చెరువుల్లో మట్టిని తవ్వుకుంటూ పోతున్నారు. కొన్ని చెరువుల్లో నీరు ఉండడంతో మట్టి రవాణాకు అడ్డుగా ఉంటుందని దీంతో అక్రమార్కులు పంట కాలువల ద్వారా దిగువకు నీటిని వదిలేస్తున్నారని దీని వల్ల వేసవిలో తమ పశువులకు నీరు లేకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగా దీనిపై పీడబ్ల్యూ ఏఈ భాస్కర్ వివరణ ఇస్తూ ఫిర్యాదులు ఏ సమయానైనా రైతులు, ప్రజలు తమకు నేరుగా చేయొచ్చన్నారు. చెరువుల్లో అక్రమంగా మట్టి రవాణాపై మైనింగ్ శాఖకు కంప్లైంట్ చేస్తామని, అదే విధంగా పోలీసు శాఖకు సైతం ఇరిగేషన్ కార్యాలయం తరపున అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యాలయ పరిధిలో మట్టి రవాణాకు ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదన్నారు.

రాత్రి వేళల్లో సాగుతున్న దందా




మద్దులగూడెం చిన్నయ్య గట్టు చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్న ప్రాంతం

ద్వారకాతిరుమల: మండలంలోని సీహెచ్ పోతేపల్లి శివారు మద్దులగూడెంలోని చిన్నయ్య గట్టు చెరువులో గత కొద్దిరోజులుగా మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. చీకటి పడితే చాలు, కూటమి నేతల మట్టి దందా మొదలవుతుంది. మట్టి రవాణా ద్వారా ట్రాక్టర్ల నుంచి వచ్చే శబ్దాలకు చుట్టుపక్కల ప్రజలకు రాత్రి వేళల్లో నిద్ర ఉండటం లేదు. అలాగే చెరువు స్వరూపం పూర్తిగా మారిపోతోంది. అక్రమార్కుల అడ్డగోలు తవ్వకాల కారణంగా చెరువులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, అగాధాలను తలపిస్తున్నాయి. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే అక్రమార్కులు ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ. 500 నుంచి రూ.700 వరకు విక్రయిస్తూ, జేబులు నింపుకుంటున్నారు. ఈ మట్టి అక్రమ తవ్వకాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు పేర్కొన్నారు.

ఆత్మీయ కలయిక







ద్వారకాతిరుమల/కామవరపుకోట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, మాజీ హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల మండలానికి చెందిన పలువురు పార్టీ నేతలు మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్సీ ఎస్టీ కేసుల విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు గుర్రాల రవికుమార్, చింతలపూడి నియోజకవర్గ ఐటీ విభాగం కన్వీనర్ వెర్రి శ్రీను మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

అంగన్‌వాడీ సెంటర్ల తనిఖీ



చిన్నారులకు అందజేసిన పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న పీడీ

కొయ్యలగూడెం: సీడీఎస్ శాఖ పీడి శారద మంగళవారం పలు అంగన్‌వాడి కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతి సదుపాయాలు, పౌష్టికాహార పంపిణీ, అదే ధంగా గర్భిణులకు అందిస్తున్న ఆహార సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. సెంటర్లలోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి లబ్ధి పొందుతున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరచూ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తూ సూపర్‌వైజర్లు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కొయ్యలగూడెం పొంగుటూరు సెక్టార్లలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కొయ్యలగూడెం ఐసీడీఎస్ కార్యాలయంలో కొయ్యలగూడెం, కుకునూరు, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం సూపర్‌వైజర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. పీవో తులసి, సూపర్‌వైజర్ అంబటి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సేవలు వినియోగించుకోవాలి



మహాజన సభలో మాట్లాడుతున్న ఏసుకుమార్

టి.నరసాపురం: రైతులకు సొసైటీ అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని మక్కినవారిగూడెం సొసైటీ ఛైర్‌పర్సన్ వై.ఏసుకుమార్ తెలిపారు. మండలంలోని మక్కినవారిగూడెం సొసైటీ ఆవరణలో మంగళవారం సొసైటీ సీఈఓ యూవీవీ సత్యనారాయణ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 11 నెలల జమా ఖర్చులు, అంచనా బడ్జెట్‌ను సీఈఓ చదివి వినిపించగా మహాజన సభ ఆమోదించింది. ఈ సందర్భంగా చైర్మన్ ఏసుకుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నుంచి సంగ సభ్యులకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సంఘం నిర్వహిస్తున్న పెట్రోల్ బంకు, పాలకేంద్రం, ఆర్ఓ వాటర్ ప్లాంట్, ఎరువులు, పురుగుమందుల వ్యాపారాలు లాభదాయకంగా ఉన్నాయని తెలిపారు. రైతులకు రైతు నేస్తం పథకం ద్వారా ఒక్కో రైతుకు రూ.5 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు పంట రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ ఆచంట సూర్యనారాయణ, మాజీ డైరెక్టర్‌లు మిడతా పెంటయ్య, అత్తులూరి పాపారావు, సీఈఓ యువీవీ సత్యనారాయణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆన్‌లైన్ సేవలు

కె.జగ్గవరం సొసైటీలో మంగళవారం మహాజనసభ నిర్వహించారు. ఛైర్‌పర్సన్ తీట్ల లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సొసైటీ ప్రగతిని, అజెండాను సీఈవో తనగాల వీరవెంకయ్య తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలను అందించడానికి కంప్యూటరీకరణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జయవరపు శ్రీరామమూర్తి, సొసైటీ మాజీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ, వాసిరెడ్డి మధు, లింగారెడ్డి శ్రీనివాస రావు, వెలిది గంగాధర రావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆశీల వేలం వాయిదా



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: మండలంలోని పరింపూడి పంచాయతీ ఆశీల వేలం 27వ తేదీకి వాయిదా పడింది. మంగళవారం కార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యంలో సర్పంచ్ ముప్పిడి విజయకుమారి అధ్యక్షతన ఆశీల వేలం నిర్వహించారు. రోజువారీ మార్కెట్, వారపు సంతకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 4.25 లక్షల చొప్పున రెండిటికీ కలిపి రూ.8.50 లక్షలుగా నిర్ణయించారు. డిపాజిట్‌దారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మించి వేలాన్ని దక్కించుకోవలసి ఉంది. అయితే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు వేలం పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేయాల్సి వచ్చిందని కార్యదర్శి తెలిపారు. పదమూడు మంది డిపాజిట్‌దారులు రూ.50 వేలు ధరావత్తు కట్టి వేలంలో పాల్గొన్నారు. డిపాజిట్ దారులు తక్కువ వేలంలో ఆశీలను దక్కించుకోవడానికి సిండికేట్‌గా వ్యవహరించడం వలన ప్రభుత్వం నిర్ణయించిన ధర రాబట్టలేకపోతున్నామని పంచాయతీకి చెందిన ఓ సీనియర్ ఉద్యోగి వ్యాఖ్యానించారు.

మూగ జీవాల బందీ



బందెలదొడ్డిలో ఉన్న ఆవులు

కుక్కునూరు: మూగజీవాలను బందెలదొడ్డిలో బంధించి మూడు రోజులైనా వాటికి గడ్డి, నీరు అందించకుండా ఉంచడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని మారేడుబాక గ్రామానికి గత మూడు రోజుల క్రితం ఆవుల మంద వచ్చింది. అవి చేలల్లోకి వెళుతుండడంతో కొందరు వాటిని స్థానిక బందెల దొడ్డిలో బంధించారు. అంతవరకు బాగానే ఉన్నా, బందెల దొడ్డిలో ఉన్న వాటిని యజమానులు వచ్చి తీసుకెళ్లే వరకు వాటికి గడ్డి, నీరు ఏర్పాటు చేయాల్సి ఉండగా అవేమి ఏర్పాట్లు చేయలేదని స్థానికులు తెలిపారు. అసలే వేసవికాలమని గడ్డి, నీరు లేకపోతే ఆవులు మృతి చెందే అవకాశం ఉంటుందని పంచాయతీ అధికారులు స్పందించాలని స్థానికులు కోరారు.

నూకాలమ్మకు సారె సమర్పణ



నూకాలమ్మకు శోభాయాత్రగా సారెను తీసుకెళుతున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో కొలువైన నూకాలమ్మ 61వ ఉగాది వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా మంగళవారం నూకాలమ్మ అమ్మవారికి సాంప్రదాయ సారెను గంగానమ్మ అమ్మవార అందజేశారు. ఉదయం 6.45కు గరగలు తీయడం ద్వారా జాతర మహోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఉదయం 9 గంగటలకు గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారి ఆలయం నుంచి గంగానమ్మ అమ్మవారు సింహ వాహనంపై ఆశీనులు కాగా, 1008 మంది మహిళలతో శోభాయాత్ర చేశారు. పసుపు, కుంకుమ, చీర, పువ్వులు, మధుర పదార్థాలతో కూడిన సాంప్రదాయ సారెను నూకాలమ్మకు అందజేశారు. కార్యక్రమంలో దత్తాత్రేయ గురుపాదుకాపీఠం స్వామి అనఘానంద స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాయంత్రం నూకాలమ్మ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నూకాంబిక సేవా బృందం, ఆలయ కమిటీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవాలు



జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొయ్యలగూడెం: కనకదుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ ఆలయ 5వ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ పర్యవేక్షణలో అర్చకులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ఆవాహిత దేవత మండపారాధన, అష్టోత్తర కలశపూజ, అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, తదితర పూజలు నిర్వహించారు.

కనకదుర్గమ్మ ఆలయంలో..

కొయ్యలగూడెం: శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయ పునఃప్రతిష్ట నిర్వహించి సంవత్సరం గడుస్తున్న సందర్భంగా ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నలభై మూడు సంవత్సరాల క్రితంనాటి అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి అర్చకులు మామిళ్ళపల్లి త్రిపురసుందరకుమార్, అభిషేక అర్చనాధి కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో అమ్మవారి ఆలయాన్ని గత ప్రభుత్వ పాలనలో నిర్మించిన సంగతి తెలిసిందే.

కలుషిత నీరు తాగేదెలా ?



కొత్త బస్టాండు ప్రాంతంలో పంచాయతీ కుళాయి ద్వారా వస్తున్న బురద నీరు

ద్వారకాతిరుమల: పంచాయితీ కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న ఈ బురద నీటిని తాగేదెలాగని స్థానిక కొత్త బస్టాండ్ పరిసర ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత వారం రోజులుగా తమకు ఇదే నీరు సరఫరా అవుతోందని అంటున్నారు. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమలలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నాలుగేళ్ల క్రితం నిర్మించిన పంచాయితీ బోరు మరమ్మతులకు గురైంది. దీంతో బస్టాండు పరిసర ప్రాంతాల వారికి గత వారం రోజులుగా కుళాయిల ద్వారా బురద నీరు సరఫరా అవుతోంది. ఈ నీరు కనీసం వాడుకకు కూడా పనికి రాని విధంగా ఉంది. అయితే చేసేదేమీ లేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు ఆ బురద నీటినే అవసరాలకు వినియోగిస్తున్నారు. తాగేందుకు మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఎండలు తారెత్తిస్తున్న సమయంలో తమకు ఈ నీటి కష్టాలు ఏమిటని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరుతున్నారు. దీనిపై ఈఓపీఆర్డీ ఏవీ సుబ్బరాయన్‌ను వివరణ కోరగా బోరుకు మరమ్మతులు చేయించామని, ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

పారిజాతగిరిలో కల్యాణోత్సవం



వేంకటేశ్వరస్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగ నిర్వహించారు. తొలుత స్వామి వారికి అష్ట దళ పద్మారాధన పూజ కార్యక్రమం నిర్వహించి, అనంతరం శ్రీస్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు కుమారాచార్యులు, రిషికేశ్ ఆచార్యులు, రాఘవ ఆచార్యులు, కన్నుల పండగగా నిర్వహించారు.

హుండీ లెక్కింపు:

గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. పరివేక్షకులుగా శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి ఆర్‌వీ చందన పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. 90 రోజులుగాను రూ. 10,65,862 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్న విజయవాడ, ఏలూరు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్, కామయ్యపాలం సేవా సంఘం, పుట్లగట్లగూడెం సేవా సంఘం, జంగారెడ్డిగూడెం సేవా సంఘం, ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, ఆలయ అర్చకులు, సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు వాసవి సాయి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్దిలో హుండీ లెక్కింపు

ఈ నెల 26వ తేదీ బుధవారం గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి హుండీ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని మంగళవారం ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

సొసైటీ మహా జనసభ



సొసైటీలో నిర్వహిస్తున్న మహా జనసభ

జంగారెడ్డిగూడెం: సొసైటీ మహాజనసభ మంగళవారం సొసైటీ ఆవరణలో నిర్వహించారు. సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి జి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ మహా జనసభలో సొసైటీ కార్యదర్శి ఆర్.లక్ష్మి సొసైటీ ప్రగతిని చదివి వినిపించారు. ఈ సభలో సొసైటీ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది బోడ ఆనంద్, చిత్తూరు రాజ్యలక్ష్మి, నౌడు శ్రీనివాసరావు, మానుకొండ ఝాన్సీరాణి, అనుమూలంక నాగేంద్ర, అప్పన రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కొయ్యలగూడెం: వేసవిలో ప్రజలకు దాహార్తి సమస్యను తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయమని ఎస్సై వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం గణేష్ సెంటర్‌లో గణపతి యువజన సేవా సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీగణపతి యువజన సంఘం చేయూతతో గ్రామానికి టీటీడీ కల్యాణ మండపం, ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్, సమకూర్చారని పేర్కొని యువజన సంఘం సభ్యులను అభినందించారు. తాడిగడప ఆంజనేయరాజు, జ్యేష్ఠ రామకృష్ణ, జమ్మి చంద్రం, నీలం దుర్గారావు, ఈదుపల్లి చంద్రశేఖర్, సంకు కృష్ణ, రాచూరి మదన్, వెంకట రమణ,స్వామి తదితరులు పాల్గొన్నారు.

అరబ్‌లో పోలవరం వాసి మృతి



షేక్ యూసఫ్ (52)

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న షేక్ యూసఫ్ (52) మంగళవారం అరబ్ దేశంలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. యూసఫ్ కొన్నేళ్లుగా అరబ్ దేశంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రతి సంవత్సరం కొద్ది రోజుల పాటు స్వగ్రామమైన పోలవరం వచ్చి నెల రోజులు కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి వెళ్లేవాడు. రంజాన్‌మాసం కావడంతో ఈ నెలలో పండుగకు వచ్చే అవకాశం ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇంతలోనే యూసఫ్ మరణవార్త వినడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పన్నులు సకాలంలో చెల్లించండి



మున్సిపల్ కమిషనర్

జంగారెడ్డిగూడెం: పురపాలక సంఘంలో ఇళ్లు, ఖాళీ స్థలాలపై పన్నులు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి అర్థ సంవత్సరానికి జూన్ నెలఖారులోపు, రెండో అర్థ సంవత్సరానికి డిసెంబర్ నెలాఖరులోపు పన్ను చెల్లించని ఎడల రెండు శాతం వడ్డీతో కలిపి చెల్లించవలసి ఉంటుందన్నారు. పురపాలక సంఘాల్లో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూలు మెరుగుపరచుటకు ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను మార్చి 31 లోపు ఒకేసారి ఏకమొత్తంలో చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీని కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సదుపాయం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పన్ను బకాయిలు లేకుండా వడ్డీ కట్టిన వారికీ వర్తిస్తుందన్నారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



జామియ మస్జిద్‌లో ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

చింతలపూడి: స్థానిక జామియ మస్జిద్‌లో మంగళవారం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం సోదరులకు స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు మత సామరస్యంతో సోదర భావంతో కలిసి, మెలిసి జీవించాలని ఈ సందర్భంగా ఉద్బోధించారు. ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రధానమంత్రి ఉపాధి కల్పన

జంగారెడ్డిగూడెం: ప్రధానమంత్రి ఉపాధి కల్పన ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. స్థానిక సూర్య పంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం లక్ష్యాన్ని వివరించి, అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

వాసవీమాతకు వెండి సమర్పణ



వాసవీ మాత ఆలయ కమిటీకి వెండిని అందజేస్తున్న దాత రాచూరి ప్రకాశరావు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి రాచూరి ప్రకాశరావు రూ.50 వేలు విలువ గల అరకేజీ వెండిని సమర్పించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు మాతు శ్రీమన్నారాయణ, కర్పూరం జనార్ధనరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు టీవీఉ రామతారకం, సభ్యులు చిన్ని తుకారామ భాస్కర గుప్త తదితరులు పాల్గొని దాతకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, గోత్రనామాలతో అర్చన చేయించారు.

శ్రీవారి సేవలో సినీ నటుడు



శ్రీవారి సన్నిధిలో సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ చంద్రకాంత్ కుటుంబం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ప్రముఖ సినీ నటుడు చంద్రకాంత్ (చిట్టి) మంగళవారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూ జలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి నిత్యార్జిత కల్యాణంలో పాల్గొన్నారు. ఆ తరువాత క్షేత్రపాలకుడైన శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయాన్ని సందర్శించి, శివయ్యకు విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ బ్లాక్ బాస్టర్ మూవీ సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో తాను మంచి పాత్రను పోషించినట్టు చెప్పారు. గతంలో నటించిన మహాత్మ, రణం వంటి ఎన్నో చిత్రాలు తనకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయన్నారు. ఇప్పటి వరకు 210 కి పైగా చిత్రాల్లో తాను నటించినట్టు తెలిపారు.

27 నుంచి ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

కామవరపుకోట: స్వయం ఉపాధి పథకంలో దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈబీసీ, కాపు కులాల వారికి ఇంటర్వ్యూలు నిర్వహించబడనని ఎంపీడీవో కె.సరళ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 28 తేదీల్లో స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించబడునని, ఇంటర్వ్యూలకు ఆయా బ్యాంక్ మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొంటారన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే దరఖాస్తుదారులు ఆదాయం, కులం ధ్రువపత్రాలు, ఆధార్ కార్డ్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, పదో తరగతి సర్టిఫికెట్, పాన్‌కార్డ్, తెలుపు రేషన్ కార్డ్, ఆరు నెలల బ్యాంకు ఖాతా వివరాలు, బ్యాంకు పాస్ బుక్ ఒరిజినల్ పత్రాలతో, ఒక జత నకలుతో హాజరు కావాలని ఆమె కోరారు.

వసతి గృహాల తనిఖీ

లింగపాలెం: ధర్మాజీగూడెంలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాలను జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్ తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు వసతి గృహాల్లో కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలపై పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. సౌకర్యాలపై ప్రశ్నించారు. విద్యార్థులు అంతా బాగుందని చెప్పడంతో జేడీ సంతృప్తి చెందారు. బాలుర బాలికల వసతి గృహాల్లో చేస్తున్న మరమ్మతులను పరిశీలించారు. పనులను నాణ్యతగా, వేగవంతంగా చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. కార్యక్రమంలో చింతలపూడి సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి రత్నకుమార్, వార్డెన్లు రాధాకృష్ణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

లింగపాలెం: పుప్పాలవారిగూడెంలో పేకాట శిబిరంపై ధర్మాజీగూడెం పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు పేకాట రాయుళ్లు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.3,800 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశారు.